## క్లుప్తంగా

### జాతీయ జెండాను అందరూ గౌరవించాలి



**నరసరావుపేట:** జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం క్యాంపు కార్యాలయంలో పోస్టల్ శాఖ ద్వారా విక్రయిస్తున్న జాతీయ జెండాలను పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ 76 వ సాతంత్ర దినోత్సవం సందర్భంగా పోస్టల్‌శాఖ ద్వారా కేవలం రూ.25లకే జెండాలను విక్రయిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ సమైఖ్యత కోసం ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పోస్టల్‌శాఖ ద్వారా జాతీయ జెండాల అమ్మకాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పోస్టాఫీసులో జెండాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్‌సీసెల్ మాని టరింగ్ కమిటీ జిల్లా సభ్యులు మల్లెల అశోక్, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, బాప్టిస్టు చర్చి పాలకవర్గ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్ పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలి



**బొల్లాపల్లి:** మండలంలోని పలు సచివాలయాల పరిధిలో నాదేశం-నామట్టి కార్యక్రమం రెండో రోజు గురువారం నిర్వహించారు. రేమిడిచర్ల, మూగచింతలపాలెం, వెల్లటూరు, కనుమలచెరువు తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తిరాములు, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచప్రాణ ప్రతిజ్ఞ, శిలాఫలకం సెల్ఫీలు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో నాదేశం-నా మట్టి కార్యక్రమం నిర్వహించాలన్నారు. దేశభక్తి కలిగి ఉండాలని, మొక్కలు నాటడం తదితర కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ అల్లాభక్షు, ఏపీఓ ఎస్.అంజనేయరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రగతిపై సమావేశం

**శావల్యాపురం:** మండలంలోని కొత్తలూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామం తుమ్మలకుంట ఎంపీపీ స్కూల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిళ్ల రాజా రమేష్ గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉండాలన్నారు. అనంతరం ఎఫ్‌ఎ-1 పరీక్షలలో విద్యార్థుల ప్రగతి, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి జగనన్న విద్యా కానుక కిట్లు వివరించారు. ఆయనతో పాటు పాఠశాల పేరెంట్ చైర్మన్ సిద్దెల మరియమ్మ పాల్గొన్నారు.

### ఉప్పలపాడులో మన భూమి - మన దేశం

**నరసరావుపేట రూరల్:** మండలంలోని ఉప్పలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని హైస్కూల్ వద్ద బుధవారం మనభూమి- మనదేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచి వడ్డే మాలశ్రీ, ఎంపీటీసీ కందుల నాగమ్మ ప్రారంభించారు. ముందుగా జిల్లా పరిషత్ హైస్కూలులోని శిలాఫలకం వద్ద ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ ఉపసర్పంచ్ వీరాంజనేయరెడ్డి, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రొంపిచర్లలో భారీ వర్షం

**రొంపిచర్ల:** మండల కేంద్రమైన రొంపిచర్ల పరిసర ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. రొంపిచర్లలో భారీ వర్షం కురవగా, సుబ్బయ్యపాలెం, కొనకంచివారిపాలెం, బుచ్చిబాపన్నపాలెం, రామిరెడ్డిపాలెం, విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, సంతగుడిపాడు, చిట్టిపోతులవారిపాలెం, అలవాల, గోగులపాడు, తుంగపాడు, అన్నవరం తదితర గ్రామాల పరిసర ప్రాంతాల్లో దుక్కిపాటి వర్షం కురిసిందని రైతులు తెలిపారు. ఈ వర్షం పొలాల్లో సాగు అవుతున్న మెట్ట పైర్లకు ఊపిరి పోస్తుందని రైతులు తెలుపుతున్నారు. ఈదురుగాలులతో వర్షం ప్రారంభం కాగానే గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

### ఘనంగా ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమం

**శావల్యాపురం:** మండలంలోని బొందిలిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమం ప్రజాప్రతినిధులు, అధికారులు సారథ్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ బోడాల వీరాంజినేయులు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి కల్గి యుండాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి నేటికి 75 వసంతాలు పూర్తి అయిన నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం మంచి శుభాపరినామమన్నారు. నాదేశం-నామట్టి ప్రతిజ్ఞ నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, కార్యదర్శి ముండ్రు మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి వెంకట్రావు, చింతా విజయ్‌కుమార్,ఉపాధి టీఏ రోజారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ గొంగటి కోటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన



జీఎస్టీని రద్దు చేయాలని, ఖాతాదారులకు బోనస్ పెంచాలని, ప్రైవేటీరణ ఆపాలని కోరుతూ జీవిత బీమా సంస్థ నరసరావుపేట బ్రాంచ్ ఎదుట గురువారం ఎల్‌ఐసీ ఏజెంట్లు ఆందోళన నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు షేక్ నబీ బాజీ, డివిజన్ నాయకులు ప్రసాద్ నినాదాలు జేశారు. యూనియన్ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కార్యక్రమం చేసినట్లు నాయకులు తెలిపారు. –నరసరావుపేట

### జాబితా పారదర్శకంగా ఉండాలి



ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టరు కందుల శ్రీరాములు సూచించారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియను సందర్శించారు. ప్రతి రోజు బీఎల్‌వోలు 25 నుంచి 30 నివాస గృహాలను సర్వే చేయాలని, అన్నీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల సర్వేకు తమ వంతు సహకారం అందించాలన్నారు. –శావల్యాపురం

### యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని వినుకొండ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ హాజరై, పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, ఎం.పోలయ్య, మహిళా సభ్యురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. –వినుకొండటౌన్

### మొక్కలే జీవనాధారం



మొక్కలు జీవనాధారాలని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి వాటిని పరిరక్షించాలని ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. వాసవీ ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద 675 పూల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామమోహన్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. –నరసరావుపేట ఈస్ట్

# ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

**చిలకలూరిపేట:** ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ధైర్యం, మన ఆశ, మన ధీమా అన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని వివరించారు. పేదలు ఈ రోజున రాష్ట్రంలో ఎంతో సంతోషంగా ఉన్నారంటే దానికి కారణం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వెల్లడించారు.

నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్య శాలలు కొత్త హంగులు సంతరించుకున్నాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని అన్ని వ్యాధులకు వర్తింపజేసి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తిగా భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. దీంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణం శరవేగంగా చేస్తున్నారని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని వివరించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో కొత్త ఊళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించిందని వెల్లడించారు. త్వరలోనే కొత్త ఊళ్లు ప్రత్యక్షమౌతాయని పేర్కొన్నారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వివరించారు. ఇలాంటి పాలన మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కీర్తి అరుణ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఘంటా శంకర్, రాచమంటి చింతారావు, గౌస్ సంధాని, ఊరంకి నాగమల్లేశ్వరరావు, యామర్తి కోటేశ్వరరావు, మాదం శ్రీనివాసరావు, ముజాఫా, బొంతా ప్రభుదాసు, షాజహాను తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్ సంతాప సభను జయప్రదం చేయండి

**నరసరావుపేట:** గద్దర్ సంతాప సభను ఈనెల 13వ తేదీ ఆదివారం ఎన్‌జీవో హోంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు వెల్లడించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సంతాప సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు,మేధావులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పీడీఎం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు నల్లపాటి రామారావు, పీకేఎస్ జిల్లా నాయకులు కంబాల ఏడుకొండలు, పౌరహక్కులసంఘ నాయకులు శిఖినం చిన్నా పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాలు వితరణ

**శావల్యాపురం:** మండలంలోని బొందిలిపాలెం గ్రామంలోని శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తల్లి ట్రస్టు సారథ్యంలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వార్డు ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న సరోజిని



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాగలక్ష్మి

**చిలకలూరిపేట:** యడ్లపాడు మండలంలోని ఖాళీగా ఉన్న రెండు పంచాయతీ వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. జిల్లా వ్యాప్తంగా ఖాళీలతో పాటు యడ్లపాడు మండలంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ప్రకటించింది. మండలంలోని కోట గ్రామ పంచాయతీలోని ఏడోవార్డు మెంబర్ బోరుగడ్డ శ్రావణి పంచాయతీ ఉపసర్పంచ్‌గా వ్యవహరించి నర్సింగ్ పోస్టు రావడంతో రెండేళ్ల తర్వాత తన పదవికి రాజీనామా చేసింది. అలాగే వంకాయలపాడు పంచాయతీ ఉప్పరపాలెం గ్రామ తొమ్మిదో వార్డు మెంబర్ పల్లపు సాంబశివరావు అనారోగ్యంతో ఆరునెలల కిందట మృతి చెందాడు. దీంతో ఈ రెండు వార్డులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి వార్డు మెంబర్ల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ల చివరి రోజున రెండు వార్డులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. కోట గ్రామంలోని ఏడో వార్డుకు బోరుగడ్డ సరోజిని, వంకాయలపాడు తొమ్మిదో వార్డుకు చనిపోయిన సాంబశివరావు కుమారుడు పల్లపు కిషోర్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ రెండు వార్డులకు సంబంధించి రిటర్నింగ్ అధికారులుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎంఈవో-1 నాగరత్నం వ్యవహరిస్తున్నారు.

**నామినేషన్ల ప్రక్రియ పూర్తి**

**రొంపిచర్ల:** మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామ పంచాయతి సర్పంచ్ పదవికి, మరో నాలుగు గ్రామాల్లోని వార్డు మెంబర్ల పదవులకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం పూర్తి అయ్యిందని ఎంపీడీవో మాధ్యుబాబు గురువారం తెలిపారు. మొత్తం 7 నామినేషన్లు దాఖలు అయ్యాయన్నారు. రామిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్‌కి రాజనాల నాగలక్ష్మి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే తురిమెళ్లలోని ఐదవ వార్డు మెంబరు పదవికి పాలెపోగు పెదబాల నాగేశ్వరరావు నామినేషన్ వేయగా, మాచవరంలోని 12వ వార్డు పదవికి కందుల వెంకట పెద్దిరెడ్డి, మునమాకలోని మూడవ వార్డుకు ఏల్చూల సత్యవతి నామినేషన్ దాఖలు చేశారు. కాగా విప్పర్లపల్లిలోని 1వ వార్డుకు గాదె కొండారెడ్డి, గాదె పిచ్చిరెడ్డి, గాదె రాఘవరెడ్డిలు నామినేషన్లు వేశారు. మాచవరం, మునమాక, తురిమెళ్ల గ్రామాల్లోని వార్డులకు, రామిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ పదవికి ఒక్కొక్క నామినేషనే దాఖలు కావటంతో ఈ పదవులకు ఎన్నిక ఏకగ్రీవం కావడం లాంచనమే. విప్పర్లపల్లిలోని 1వ వార్డుకు మూడు నామినేషన్లు దాఖలు అవ్వటంతో పోలింగ్ జరుగనుంది. కాగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ వార్డుపై పోలింగ్ అవసరమో లేదో తెలుస్తుంది. రామిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్‌గా గతంలో ఎన్నికైన రాజనాల వెంకటరెడ్డి మృతి చెందారు. గ్రామస్తులందరూ కలిసి ఆయన సతీమణి నాగలక్ష్మిని సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎంపిక చేసి నామినేషన్ దాఖలు చేయించారు.

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎండీవో**

**రొంపిచర్ల:** మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్‌లకు నిర్వహించనున్న ఉప ఎన్నికలకు సంబంధించి ఐదు గ్రామాల్లో నిర్వహిస్తున్న నామినేషన్ల ప్రక్రియను ఎండీవో కె.మాధ్యుబాబు గురువారం పరిశీలించారు. రామిరెడ్డిపాలెం పాఠశాలలో గ్రామ సర్పంచ్ పదవికి స్వీకరిస్తున్న నామినేషన్ల ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఎన్నికల అధికారి పంచాయతీరాజ్ ఏఈ జగన్ మోహన్ రెడ్డికి పలు సూచనలు చేశా రు. కాగా తురిమెళ్ల, మాచవరం, విప్పర్లపల్లి, మున మాక గ్రామాల్లో వార్డు మెంబర్లకు స్వీకరిస్తున్న నామినేషన్ల ప్రక్రియను కూడా ఆయన పరిశీలించారు. ఆయ న మాట్లాడుతూ మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవితో పాటు తురిమెళ్ల గ్రామంలోని ఐదవ వార్డు, మాచవరం గ్రామంలోని 12వ వార్డు, విప్పర్లపల్లిలోని 1వ వార్డు, మునమాక గ్రామంలోని 3వ వార్డుకు ఉపఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, తిరస్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 12వ తేదీన తిరస్కరించిన నామినేషన్లపై ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చు అన్నారు. 13న అప్పీల్ పరిష్కారం, 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉండగా అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబి తా ప్రకటిస్తామన్నారు. అనంతరం ఎన్నికలు అవసరమైన చోట 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు.

# జగనన్న కాలనీలో గృహప్రవేశం

ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, సుస్మిత దంపతులు



నూతన గ్రహంలో ఇంటి యజమానులతో ఎమ్మెల్యే గోపిరెడ్డి దంపతులు

**నరసరావుపేట:** స్థానిక వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ సుస్మిత ఆర్థో - ట్రామా కేర్ హాస్పిటల్‌లో పనిచేసే సీనియర్ సిబ్బంది గుంటు కోటయ్య, వెంకటమ్మ నిర్మించిన నూతన గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ సుస్మిత హాజరయ్యారు. కోటయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు చేతుల మీదగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. కోటయ్య నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. బెడ్‌రూమ్ గదిని హౌసింగ్ డీఈ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

వేర్వేరు ప్రాంతాల్లో నులిపురుగుల నివారణ దినం



చిన్నారులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి డాక్టరు బత్తుల గీతాంజలి

**బొల్లాపల్లి:** మండలంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ పిల్లలచే మింగించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ పరిధిలో 5441 మంది చిన్నారులకుగాను, 5223 మంది చిన్నారులకు ట్యాబ్లెట్స్ పంపిణీ చేసినట్లు వైద్యాధికారి శంకర నారాయణ తెలిపారు. సుమారు 96 శాతం నమోదైందన్నారు. వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలో 4600 మందికిగాను, 4230 మంది చిన్నారులకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ట్యాబ్లెట్లు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వి.నరేష్ తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఈనెల 17న ట్యాబ్లెట్స్ అందజేస్తామని చెప్పారు. డివార్మింగ్ డేను పురస్కరించుకుని ఎంపీపీ బత్తి రాములు, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషాలు బొల్లాపల్లి హైస్కూల్‌లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వి.వినూత్న, ఎంఇఓ 2 కె. పార్వతి, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం అన్నీ ప్రభుత్వ, ప్రవేటు, పాఠశాలల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో వైద్య ఆరోగ్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక బీసీ కాలనీలో అంగన్‌వాడీ సెంటరులో జిల్లా ఇమ్యూనేజేషన్ (టీకా) వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారందరికి అల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు మింగిచటం ద్వారా కడుపులో ఉండే నులిపురుగులు బద్దెపురుగులు నియంత్రణతో పాటు విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో 6698 విద్యార్థులను గుర్తించగా 5181 మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తదుపరి మందు బిళ్లలు మింగించామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# మణిపూర్ హింసను ఖండించండి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు
- వినుకొండలో ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న నాయకులు

**వినుకొండ (నూజెండ్ల):** భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో మైనారిటీలపై దాడులు చేయడమేకాకుండా, అమానుషంగా హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మణిపూర్ సంఘటనలకు నిరసనగా పట్టణంలో గురువారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగం ముందు అన్ని మతాలు సమానమేనని, ఆ రాజ్యాంగాన్ని మన దేశంలో తూట్లు పొడుస్తున్నారన్నారు. అటువంటి మతోన్మాద విధానాలు అవలంభిస్తున్న బీజేపీ రాజకీయ అధికారాన్ని మార్చడమే నేడు ప్రజల ముందున్న కర్తవ్యమన్నారు. పాస్టర్ రోషన్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో మైనార్టీ ప్రజలైన క్రిస్టియన్ సోదరులపై మారణకాండ చేస్తూ, హత్యలు చేస్తూ, చర్చిలు తగులబెడుతూ దాడులు జరుగుతుంటే, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్ మారణ కాండపై మాట్లాడాలంటూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుంటే, ప్రధాని మౌనం వహిస్తున్నారని అన్నారు.

### తెలుగు జర్నలిజంలో తుర్లపాటిది ప్రత్యేక స్థానం

**చిలకలూరిపేటటౌన్:** తెలుగు జర్నలిజంలో ప్రముఖ పాత్ర పోషించి, చివరి వరకు జర్నలిస్టుగా కొనసాగిన మహోన్నత వ్యక్తి తుర్లపాటి కుటుంబరావు అని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక, శాఖ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ప్రాతికేయుడు తుర్లపాటి జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్లపాటి కుటుంబరావు జర్నలిస్టుగానే కాకుండా 18 వేల ప్రసంగాలు చేసి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారని వివరించారు. ఆయన స్ఫూర్తితో పాత్రికేయులు పనిచేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, సభ్యులు చుక్కా వెన్సెంట్‌పాల్, గ్రంథాలయ సిబ్బంది డి వీర్రాజు, సరోజిని పాల్గొన్నారు.

### చిరస్మరణీయుడు శంకరంబాడి సుందరాచారి

**చిలకలూరిపేట:** తెలుగుజాతి గర్వించదగ్గ కవి శంకరంబాడి సుందరాచారి అని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలోని బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువాడు ఎప్పటికీ గుర్తించుకునేలా రాష్ట్ర గేయం మా తెలుగు తల్లికి మల్లెపూదండ రాసిన కవి సుందరాచారి ధన్యజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరు లక్ష్మయ్య, స్కూల్ హెచ్ఎం జీవీ హేమలత తదితరులు పాల్గొన్నారు.


# వేగ జ్యూయలర్స్ అమ్మకాలను సద్వినియోగం చేసుకోండి



ప్రదర్శనకు హాజరైన అతిథులు, యజమానులు

**నరసరావుపేట:** స్థానిక ప్రకాష్‌నగర్‌లోని ఏ-1 కన్వెన్షన్ హాలులో గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న వేగ జ్యూయలర్స్ వారి బంగారు, వజ్రాభరణాల ప్రదర్శన, అమ్మకాలను సద్వినియోగం చేసుకోవాలి సంస్థ ప్రతినిధులు వనమా పవన్, వనమా సుధాకర్ గురువారం కోరారు. విజయవాడ, హైదరాబాదు నగరాలకే పరిమితమైన ఈ ప్రదర్శన, అమ్మకాల కార్యక్రమానికి ఏపీ బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, డాక్టర్ కడియాల గొట్టి పాటి లక్ష్మి, డాక్టర్ శ్రీరామినేని హిందూజా ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. మంగళప్రదమైన వేడుకలు, వివాహాది శుభ కార్యక్రమాలకు కావల్సిన విశిష్ట ఆభరణాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. పోల్కీ జ్యూయలర్స్‌పై ఎటువంటి మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవన్నారు. ఆభరణాల ప్రియులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**నరసరావుపేట రూరల్:** మండలంలోని కాకాని గ్రామ సమీపంలో గల జేఎన్‌టీయు క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు మాట్లాడుతూ మొక్కలు మానవులు, జంతువులకు చాలా సహాయకారిగా ఉంటాయన్నారు. మొక్కలు ఔషధ గుణాలకు కూడా కలిగి ఉంటాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ఆహారం, ఆక్సిజన్ అందిస్తాయన్నారు. కాకాని గ్రామంలో మాజీ సైనికులు, సర్పంచ్, వార్డు మెంబర్లులను సన్మానించారు. కాకాని గ్రామ సర్పంచి దుర్గాప్రసాద్, దండా వీరాంజనేయులు, కళాశాల మెకానికల్ విభాగ అధిపతి ఐ.ఫణిసుష్మా, ఎలక్ట్రానిక్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎ.గంగాధర్, ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ ఇంజనీర్ డాక్టర్ కె. విమల్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ.రాజు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.